# ఆధునిక నీతి కథలు 

## తాళ్లూరు నాగేశ్వరరావు

వరహాలరావుకు మరో పేరు బేరాలరావు. నిద్ర లేచింది మొదలు మళ్లీ నిద్రలోకి జారుకొనేవరకూ ఏ వ్యవహారం తటస్థపడ్డా బేరమాడితేగానీ అతగాడి మనస్సుకు తృప్తి వుండదు. తనకు బేరమాడే గుణం అబ్బడంవల్లనే జీవితంలో కొన్నివేల రూపాయలు పొదుపుచేయడం జరిగిందని అప్పుడప్పుడూ సగర్వంగా సంతృప్తిపడుతూ వుంటాడు. అయితే తాను కడుపునిండ బేరంచేస్తే అవతలివాడు కడుపుమండి ఆ బేరానికి లొంగకపోయినా అంతగా పట్టించుకోడు. అవమానంకింద తీసుకోడు. బేరాలాడడం వరహాలరావుకు సరదా కాదు. అలవాటు. ఆ అలవాటులో అప్పుడప్పుడు రైల్వేటిక్కెట్టు కొనేటప్పుడు కూడా బేరమాడే పొరపాటు చేస్తూవుండటం కద్దు.

ఓ రోజు వరహాలరావు ఏదో పనిమీద గుంటూరు వచ్చాడు. అంతకుముందెప్పుడూ ఆ పట్టణం రాలేదు. అరండాల్‌పేటలో అయిదో అడ్డరోడ్డులో వున్న అడ్వకేట్ దగ్గర పని అయిపోగానే రైలు కెళ్దామని రోడ్డుమీద కొచ్చి ఓ రిక్షాను ఆపాడు.

"ఏయ్! రిక్షావాలా! స్టేషనుకు ఎంత కొస్తావోయ్?"

"తమ దయ బాబూ! బీదోడ్ని" అన్నాడు రిక్షావాడు మామూలు వినయంతో.

"నేనూ బీదవాడ్నే, కాకపోతే అవసరంకొద్దీ రిక్షా ఎక్కుతున్నాను" అన్నాడు వరహాలరావు బేరమాడే నైపుణ్యానికి నాందీ వాక్యంగా.

"ముప్పావలా ఇప్పించండి బాబూ!" అన్నాడు రిక్షావాడు.

"ముప్పావలా యే! ఏమిటోయ్ ఈ వూరికి నేను కొత్తవాణ్ణనుకుంటున్నావా అయ్!" అన్నాడు వరహాలరావు తెచ్చుకున్న కోపంతో కసురుకుంటూ.

"అవునండి! మీరు కొత్తవారే," అన్నాడు రిక్షా కార్మికుడు బుర్రమీసాల్లోంచి కుర్రతనంగా నవ్వుతూ.

వరహాలరావు ఖంగుతిన్నాడు. కొన్ని క్షణాలపాటు నోటమాట పెగల్లేదు.

"కొత్తవాళ్లు కాబట్టే బేరమాడుతున్నారు. ఇక్కణ్ణుంచి స్టేషన్‌కు మూడు ఫర్లాంగులు కాదు, పావుగంట సమయమేనని చెప్పే పాత వాళ్లను కూడా... "

మరోమాట మాట్లాడకుండా చప్పున రిక్షా ఎక్కి కూర్చున్నాడు వరహాలరావు.

*బేరాలు ఆడటానికి పాత ప్రదేశాలు గానీ కొత్త ప్రదేశాలు అంత లాయకీగా ఉండవు*

---

*మరో కొత్త శీర్షిక*

# నవ్వండి! – నవ్వించండి!!

ఈ రోజుల్లో జోక్స్ చదవడం, రాయడం, చెప్పుకోవడం మహా పెద్ద సరదా అయిపోయింది. కడుపుబ్బ నవ్వించే జోక్స్ అందించడంలో 'యువ'కు రెండు దశాబ్దాలుగా మంచి పేరుందని ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదు

జోక్స్ ఎవరైనా వ్రాయవచ్చు దానికి రచనా పటిమ, అనుభవం అక్కర్లేదు. మీకు మంచివిగా, ఇతర్లను నవ్వించేవిగా, హాస్యరసాన్ని సృష్టించేవిగా వున్న జోక్స్‌ను మాకు పంపించండి నెలనెలా ప్రచురిస్తాం.

ప్రచురించబడిన ప్రతి జోక్ రచయితకూ 'యువ' సంచికను పంపుతాం. జోక్ రచయితలు, రచయిత్రులు మాతో సహకరిస్తారు కదూ!

*సంపాదకుడు,*

యువ.

---